


సుధాకర్ టెలివిజన్ సెట్లు అమ్మే షోరూం ముందు నిల్చొని భారతదేశానికి, పాకిస్తాన్‌కు మధ్య జరుగుతున్న క్రికెట్ మ్యాచ్ ప్రత్యక్షప్రసారాన్ని చూస్తున్నాడు. అతనితో బాటు ఆ షోరూం ముందు ఇంకా చాలామంది యువకులు నిల్చొని నరాలు తెగిపోతాయా అన్నంత ఉత్కంఠతో ఆ మ్యాచ్‌ను వీక్షిస్తున్నారు.

మ్యాచ్ నిజంగానే చాలా ఉత్కంఠ భరితంగా సాగుతోంది. చివరిక్షణం వరకు.... చివరి బంతిని విసిరే అంతవరకు విజయం ఎవర్ని వరిస్తుందో ఊహించలేని పరిస్థితి.

సుధాకర్ కంటిమీద రెప్పవేయకుండా టీ.వీ.స్క్రీన్ కేసి చూస్తున్నాడు. అది జెయింట్ స్క్రీన్. ఇంచుమించు 35 ఎం.ఎం. అంత

కథ

# గాజుతెర

## అంపశయ్య నవీన్

పెద్దస్క్రీన్ మీద ఆ షోరూం వాళ్ళు క్రికెట్ మ్యాచ్ ప్రత్యక్ష ప్రసారాన్ని చూపిస్తున్నారు. ఆ మ్యాచ్ ఎక్కడో సౌత్ ఆఫ్రికాలో జరుగుతోంది. కొన్ని వేల మైళ్ళ దూరంలో..... ఎక్కడో పరాయిదేశంలో జరుగుతున్న మ్యాచ్‌ని మనకళ్ళముందే జరుగుతున్నట్టుగా చూపించడం ఎంత అద్భుతమో వాళ్లు గమనించడం లేదు. బయటి ప్రపంచాన్ని పూర్తిగా మరచిపోయి వాళ్ళు క్రికెట్ ప్రపంచంలో తలమునకలవుతున్నారు.

సుధాకర్ స్వయంగా క్రికెట్ ప్లేయర్ కావడం వల్ల అతనికి ఆ ఆటలోని సూక్ష్మాంశాలన్నీ బాగా తెలుసు. అతడు తదేకంగా టీవీ స్క్రీన్ కేసి చూస్తూ, ఒక్కొక్క బంతిని గమనిస్తూ, తాను బ్యాటింగ్ చేస్తే ఆ బంతిని ఎలా ఆడేవాడో ఊహిస్తున్నాడు. ఒక వోవర్‌కూ మరో వోవర్‌కు మధ్య వస్తున్న యాడ్స్ అతనికి చాలా చిరాకును కల్గిస్తున్నాయి.

తనకూ అలాంటి టీ.వీ.సెట్ ఉంటే ఎంత బావుండును, హాయిగా ఇంట్లో కూర్చొని ప్రతి బంతిని, ప్రతి షాట్‌ను ఇంకా జాగ్రత్తగా గమనిస్తూ ఎంజాయ్ చేసేవాడు.

ఇండియా ఈ మ్యాచ్‌ను గెలిచి తీరాలి. మొదట బ్యాటింగ్ చేసిన ఇండియా యాభై ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 280 పరుగులు చేసింది. అది చాలా మంచి స్కోరే. అప్పుడే ఈ మ్యాచ్‌ని ఇండియా తప్పకుండా గెలిచి తీరుతుందనుకున్నాడు. కానీ పాకిస్తాన్ బ్యాట్స్‌మెన్ కూడా

## సామాజిక వ్యాఖ్యాత శోభాడే

కాలమిస్ట్, జర్నలిస్ట్, గృహిణి, తల్లి, నిరాఘాట రచయిత్రి, అభిప్రాయ నిర్మాత్రి, నూతన ఒరవళ్ళ సృష్టికర్త, భారత ఉపఖండంలోనే అత్యధిక కాపీలు అమ్ముడయ్యే ఆంగ్ల ఫిక్షన్ రైటర్, సమకాలీన మహిళామణి శ్రీమతి 'డే'. తమను తాము పునరావిష్కరించుకునే అరుదైన కళ తెలిసిన కొద్దిమంది వ్యక్తుల్లో శోభాడే ఒకరు. ఒక ఫిలిం మేగజైన్ ఎడిటర్‌గా ఆమె "నువ్వా – నేనా" అంటూ పోటీపడే మూవీ జర్నలిజంలో తనదైన వైవిధ్యాన్ని ప్రవేశపెట్టిన వైతాళికురాలు.

ఆమె నవలల విమర్శకులు ఎంత దుష్ప్రచారం చేసినా అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల్లో 'పఠన పట్టీ'ల్లో ఆమె నవలలు చోటు సంపాదించుకున్నాయి. 'అరవైకి ఒకటి తక్కువ' ప్రాయంలో ఆమె సొగసులు చెక్కు చెదరలేదనటానికి ఆమె ఇటీవలనే ప్రారంభించిన ఫ్యాషన్ లేబెల్ 'శోబాడే'నే అద్దం పడుతుంది. "తాను శక్తివంతురాలనని నమ్మకమున్న మహిళా ప్రధాన కర్తవ్యాలు రెండు. తాను సాధికారత సాధించి ఇతరులను తనలా మార్చటం, తమ మాట వినేదెవరులే అని నిస్తబ్దంగా ఉండిపోయిన సాటి మహిళలకు గళాన్ని జాగృతం చేయటం. శూన్యంగా, నిరుపయోగంగా నిలిచిపోయిన శక్తి అర్థరహితమైనదే" అంటారు శోభాడే.



దీటుగా, ధాటిగా ఆడుతూ పరుగుల వర్షాన్ని కురిపిస్తున్నారు. వాళ్ళ ఆట తీరు చూస్తుంటే వాళ్ళే గెలుస్తారేమోననిపిస్తోంది. కానీ వాళ్ళు గెలవకూడదు. ఇండియా ఈ మ్యాచ్ గెలిచి తీరాలి. ఇండియాగెలిస్తే తను గెలిచినట్టు.. ఇండియాఓడిపోతే తను ఓడిపోయినట్టు..

సుధాకర్ ఇలా ఆలోచిస్తుండగానే పాకిస్తాన్ తన ఐదో వికెట్ కోల్పోయింది. ఆ షోరూం ముందు నిల్చున్న యువకులంతా "అవుట్" అంటూ పెద్దపెట్టున అరిచారు. కొందరు యువకులు ఎగిరి గంతులు వేసారు. ఆల్‌రెడీ, ఇండియా గెల్చిందన్నట్టుగా సంబరాలు జరుపుకున్నారు. అందరూ ద్విగుణీకృత ఉత్సాహంతో మ్యాచ్ చూడసాగారు.

ఓవర్లు అయిపోతున్నాయి. పాకిస్తాన్ సాధించాల్సిన పరుగుల లక్ష్యం చాలా దగ్గర పడింది.

చివరి ఓవర్... పాకిస్తాన్ గెలవాలంటే ఇంకో 12 పరుగులు చెయ్యాలి. ఇండియన్ బౌలర్ వేసిన మొదటి బంతిని పాకిస్తాన్ బ్యాట్స్‌మేన్ బౌండరీ అవతలకి పంపించేశాడు. దాంతో పాకిస్తాన్ ఖాతాలో నాల్గు పరుగులు చేరాయి. ఇక ఎనిమిది పరుగులు మాత్రమే.... రెండో బంతికి ఒక్క పరుగు కూడా లభించలేదు. మూడో బంతికి ఒక్క పరుగు నాల్గో బంతికి పాకిస్తాన్ ఆరో వికెట్... "క్లీన్ బౌల్డ్" అని పెద్ద పెట్టున అరుపులు. కొత్త బ్యాట్స్‌మన్ క్రీజ్ మీదకు వచ్చేంతవరకు అందరిలోనూ దుర్భరమైన ఉత్కంఠ... ఐదో బంతికి మరో పరుగు.... ఆరో బంతికి పరుగులేమీ లభించలేదు. దాంతో ఐదుపరుగుల తేడాతో ఇండియా గెలిచింది.

టీ.వీ.స్క్రీన్ మీద మ్యాచ్ చూస్తున్న వాళ్ళంతా పెద్ద పెట్టున 'చెక్ దే ఇండియా" అంటూ అరుస్తూ డ్యాన్స్ చెయ్యసాగారు. ఒకర్నొకరు కౌగిలించుకోసాగారు. కొందరి దగ్గర రెడీగా ఉన్న క్రాకర్స్‌ని పేల్చసాగారు. రోడ్డు మీద వెళ్తున్న ట్రాఫికంతా కొన్ని క్షణాల పాటు స్తంభించిపోయింది.

సుధాకర్‌కు ఆకాశంలో తేలిపోతున్నట్టుగా ఉంది. తనే క్రికెట్ ఆడి పాకిస్తాన్‌ను ఓడించినట్టుగా ఫీలయ్యాడు.

మెల్లమెల్లగా టీ.వీ.షోరూం ముందు గుమిగూడిన యువకులంతా వెళ్ళిపోయారు. సుధాకర్‌మాత్రం అలాగే నిల్చొని లోపల అత్యంత ఆకర్షణీయంగా అమర్చబడిన రకరకాల టీ.వీ. సెట్లను, ఆ టీ.వీ.స్క్రీన్స్ మీద వస్తున్న వివిధ ఛానళ్ళ ప్రసారాలను చూడసాగాడు.

రకరకాల టీ.వీ. సెట్స్... చిన్న స్క్రీన్స్... మధ్య రకపు స్క్రీన్స్... జెయింట్ స్క్రీన్స్...ముప్పై నలభై టీవీలను గ్లాస్‌కర్టెన్ల వెనక అమర్చారు. అదెంతో అద్భుత దృశ్యంగా అతనికి కనిపించింది. టీవీలతో బాటు ఆ గాజుతెరల వెనక ఇంకెన్నో విలాసవస్తువులు... కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, డీ.వీ.డీ ప్లేయర్స్, ఐ విింగ్స్... డిజిటల్ కెమెరాలు... హ్యాండీకామ్ కెమెరాలు... వీటిని కొనుక్కోగల్గే అదృష్ట వంతులెవరో!

'యేందిరా సుధాకర్ ! ఇంక ఇక్కడ్నే నిలబడ్డవేంది? క్రికెట్ మ్యాచ్ అయిపోయింది కద" అన్నాడు అట్నించే వెళ్తున్న ఉపేందర్ సుధాకర్ భుజం మీద చెయ్యేసి.

''మ్యాచ్ అయిపోయింది నిజమే. కానీ నాకే షోరూం ముందు నుండి కదలబుద్ధి కావడం లేదురా...." అన్నాడు సుధాకర్.

"ఎందుకురా?"

"ఇన్ని అందమైన టీవీ సెట్లను ఒకేచోట చూస్తోంటే ఎంత వండర్‌ఫుల్‌గా ఉందో... వాటిల్లో కనీసం ఒక్కటైనా మన స్వంతమైతే ఎంత బావుండును"

"మింగమెతుకు లేదు గానీ మీసాలకు సెంటు అన్నాడట వెనకటికెవడో... పూట గడవటమే కష్టంగా ఉన్న మనకు ఈ కలర్ టీవీలెక్కడ్నించొస్తాయిరా... వెళ్దాం పద"

"నువ్వు చూస్తుండు... నేను క్రికెట్ ఆడి బోల్డు డబ్బు సంపాదిస్త...."

"నీ మొఖంలేరా.... హైస్కూలు లెవల్లో క్రికెట్ ఆడినంతమాత్రాన నువ్వో నేషనల్ ప్లేయర్ని అయిపోయాననుకుంటున్నావులేరా?"

"ఇప్పుడు కాలేదు. కానీ ముందు ముందు అయితే... నాకు క్రికెట్ ఆటలో చాలా సహజమైన ప్రావీణ్యం ఉందని మా పీ.యీ.టీ సార్ అన్నాడు."

"నీకు సహజమైన ప్రావీణ్యం ఉండొచ్చురా... కానీ క్రికెట్‌లో పైకెళ్ళాలంటే అదొక్కటే సరిపోదు. నీకు బాగా డబ్బుండాలి... క్రికెట్ పెద్దలతో కనెక్షన్లుండాలి. నువ్వో అగ్రకులానికి చెందిన వాడివై ఉండాలి. క్రికెట్ ప్రపంచంలో ఎన్ని రాజకీయాలున్నాయో నీకు తెలియదురా... నేను నేషనల్ ప్లేయర్‌నుఅవుతానని అనుకుంటున్న

నిన్ను చూస్తే నాకు జాలేస్తోంది."

"నీ జాలి నాకేమీ అక్కర్లేదుగానీ నీ దారిన నువ్వెళ్ళిపో. నేను కాస్సేపాగి వస్తా" అన్నాడుసుధాకర్.

"నీకు క్రికెట్ పిచ్చి, టీవీల పిచ్చి ముదిరిపోయిందిరా... పనీ పాట లేకుండా ఇంకెంతకాలం ఇట్లా దివాన గాని లెక్క తిరుగుతవో చూస్త" అంటూనే ఉపేందర్ అక్కడ్నించి వెళ్ళి పోయాడు. కాస్సేప్పయ్యాక సుధాకర్ కూడా అక్కడ్నించి ఇంటికెళ్ళి పోయాడు.

సుధాకర్,ఉపేందర్‌ల ఇండ్లు పక్కపక్కనే ఉంటాయి. హైస్కూలు వరకు ఇద్దరు ఒకే స్కూలులో ఒకే క్లాసులో కలిసి చదువుకున్నారు. పదో తరగతి పాసయ్యాక ఉపేందర్ చదువు ఆగిపోయింది. అతని కులవృత్తి తాపీపని చేసుకుంటూ అంతో ఇంతో సంపాదిస్తున్నాడు. సుధాకర్ కులవృత్తి కూడా తాపీపనే. కానీ అతనికా పనంటే ఇష్టం లేదు.

సుధాకర్ పదోతరగతి చదువుతున్నప్పుడే అతని తండ్రి సారయ్య అకస్మాత్తుగా గుండెపోటుతో మరణించాడు.

తాపీమేస్త్రీగా సారయ్యకు చాలా మంచి పేరే ఉండేది. ఒప్పుకున్న పనిని సకాలంలో పూర్తి చేస్తాడని. ఇల్లు కట్టించుకునేవాళ్ళకు ఎలాంటి ఇబ్బందులను కల్గించడనీ, అతను చేసే నిర్మాణపు పనికూడా చాలా నాణ్యతగా ఉంటుందని చెప్పుకునేవాళ్ళు. కాబట్టి అతనికి చేతినిండా పని దొరికేది. మేస్త్రీ అయ్యాక కూడా సారయ్య తన కింద పనిచేసే వాళ్ళతో బాటు తనూ తాపీ పట్టుకొని పనిచేసేవాడు. అలా అతడు బాగానే సంపాదించాడు. ఆ సంపాదనతోటే అతడు తనకోసం ఓ మంచిఇల్లు కూడా నిర్మించుకున్నాడు.

మొదట్లో సారయ్యకు ఎలాంటి దురలవాట్లు లేవు. కానీ సంపాదన పెరుగుతున్న కొద్దీ అతనికి దురలవాట్లు కూడా పెరిగాయి. సాయంత్రం కాగానే తాపీ మేస్త్రీలందరూ కల్లు పాకలోనో, బెల్టు షాపుల్లోనో చేరేవాళ్ళు. మొదట్లో వాళ్ళకు దూరంగా ఉన్న సారయ్య తర్వాత వాళ్లతో చేరిపోయాడు. వాళ్ళకు దూరంగా ఉన్నంత కాలం వాళ్ళతన్ని వెలివేసినట్లుగా చూసేవాళ్ళు. వాళ్ళ ఆగ్రహానికి గురికావడం ఎందుకని సారయ్య వాళ్ళతో చేరిపోయి వాళ్ళకంటె ఎక్కువగా తాగటానికి అలవాటు పడ్డాడు. తాగటంతో పాటు పేకాటకు కూడా అతడు బానిసైపోయాడు. పేకాటలో సారయ్య విప రీతంగా డబ్బు పోగొట్టుకునేవాడు.

అతనికి సుధాకర్ తర్వాత ఓ కూతురు కూడా పుట్టింది. సుధాకర్‌ను బాగా చదివించాలనీ, కూతురుకు సాధ్యమైనంత త్వరగా పెళ్ళి చెయ్యాలని అతడనుకునేవాడు. అతని భార్య సంధ్య భర్తనెప్పుడూ తాగుడు, పేకాట మానెయ్యమని బలవంతం చేసేది కాదు. భర్తకు ఎప్పుడూ ఎదురు చెప్పకూడదన్న పెద్దల మాటల్ని ఆమె తు.చ. తప్పకుండా ఆచరణలో పెట్టేది.

సారయ్య ఒకరోజు రాత్రంతా పేకాట ఆడి ఐదువేల రూపాయల్ని పోగొట్టుకుని ఆ దిగులుతో తెలతెల వారుతుండగా ఇంటికొచ్చాడు. ఇంటి కొచ్చిన కాస్సేపట్లోనే అతనికి గుండె నొప్పి వచ్చింది. హాస్పిటల్‌కు తీసికెళ్ళే లోపలే సారయ్య ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయాయి.

తండ్రి చావును సుధాకర్ కళ్ళారా చూసి షాకైపోయాడు. ఒకవ్యక్తి చనిపోవడం ఇంత త్వరగా, ఇంత సులువుగా జరుగుతుందని అతడు ఊహించలేదు. తండ్రి పోవడంతో అతనికి అతని కాళ్ళకింది భూమి కదిలి పోయిందని పించింది.

'ఎన్ని కష్టాలైనా పడి నిన్ను బాగా చదివిస్త. పెద్ద ఆఫీసర్ని చేస్త. నువ్వు నా తీరుగ ఈ తాపీపని చెయ్యొద్దు. నువ్వు బాగా చదువుకోవాలె. అమెరికాకు బోవాలె. మస్తు పైసలు సంపాయించాలె". అంటుండే అతని తండ్రి మాటలు సుధాకర్‌కు పదే పదే వినిపించాయి. తాగుడు మీద, పేకాటమీద ఎంతఖర్చుచేసినా కొడుకు చదువుకోసం మాత్రం లేదనకుండా సారయ్య డబ్బులిస్తుండేవాడు.

సుధాకర్‌కు కూడా పెద్ద చదువులు చదవాలని ఉండేది. డాక్టర్నో, ఇంజనీర్నో కావాలని, యే అమెరికాకో, ఆస్ట్రేలియాకో వెళ్ళాలని కలలు కనేవాడు. తండ్రి అకస్మాత్తుగా చనిపోవడంతో అతనికలలన్నీ కల్లలైపోయినట్లనిపించింది. ఒక్క ఇల్లు తప్ప సారయ్య ఆ కుటుంబానికి ఇచ్చిపోయిన ఆస్తంటూ ఏమీ లేదు. అతడు తనతోటి తాపీమేస్త్రీల దగ్గర చేసిన అప్పులింకా కొన్ని మిగిలే ఉన్నాయి.

తండ్రి చనిపోయినతర్వాత సుధాకర్‌కు



## దర్శకురాలు దీపామెహతా

దర్శకురాలు, రచయిత్రి, నిర్మాత, నటి దీపామెహతా మహా మేధావి ఆమె నైతిక నిబద్ధత సామాన్యులకు అంతు చిక్కదు. కళలకు ప్రతిరూపంగా ఆమెను పేర్కొనటం అతిశయోక్తి కాబోదు. 'భారతీయ విధవ' అయిన స్త్రీ స్థితిగతులు ఎలా ఉంటాయన్న అంశాలను 'వాటర్' చిత్రం ద్వారా పాశ్చాత్య సమాజానికి చూపాలనుకున్న ఆమె ప్రయత్నాలకు మతఛాందసులు పలు విఘాతాలు కల్పించటమే కాకుండా ఆమెను చంపేస్తామంటూ కూడా బెదిరించారు. అప్పటి ప్రధాని వాజ్‌పేయి జోక్యంతో ఎట్టకేలకు అల్లరి సద్దుమణిగి తిరిగి నూతన తారాగణంతో శ్రీలంకలో చిత్ర నిర్మాణం పూర్తయింది.

నిజాన్ని నిర్భయంగా చెప్పటంలో దీపామెహతా అరుదైన ప్రతిభా పాటవాలను చూపుతారు. నైతికత ముసుగులో దాగుండే వాస్తవాలను ఆమె వెలికి తీస్తారు. ఉదాహరణకు 'ఫైర్' సినిమాలో లెస్బియనిజం (స్త్రీలలో స్వలింగపర్కం), భారతదేశంలో విభజనకు సంబంధించి పాతుకుపోయిన కథలను 'ఎర్త్' సినిమాలోనూ చూపారు.

ఇక ఆమె వినూత్న దృక్పథాన్ని గురించి చెప్పాలంటే కెనడాలో ఆ మధ్య చోటుచేసుకున్న కొమగత మారూ సంఘటనను 'ఎక్స్‌క్లూజన్'గా తెరకెక్కిస్తున్నారు.

చదువుమీద శ్రద్ధ తగ్గిపోయింది. వాళ్ళ స్కూల్లో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్గా పనిచేస్తున్న ప్రభాకర్ దృష్టి సుధాకర్మీద పడింది. ఒకరోజు సుధాకర్ క్రికెట్ ఆడుతోంటే ప్రభాకర్ చూశాడు. సుధాకర్ బ్యాట్ పట్టుకున్న పద్ధతిలోనూ, క్రీజులో నిల్చున్న విధానంలోనూ, షాట్లు కొడ్తున్న ధోరణిలోనూ ప్రభాకర్కు కొత్తదనం కనిపించింది. సరిఅయిన కోచింగ్ ఇస్తే సుధాకర్ ఒక మంచి క్రికెట్ ప్లేయర్ అవుతాడనిపించింది.

అప్పట్నుంచి సుధాకర్ రోజూ క్రికెట్ ఆడటం మొద లెట్టాడు.

క్రికెట్ ఆడుతున్నంత సేపు సుధాకర్ తన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని పూర్తిగా మరిచిపోతూండేవాడు. తనవైపు విసరబడ్తున్న బంతి తప్ప అతనికి మరేది కనిపించేదికాదు. ఆ బంతిని తన చేతిలో ఉన్న బ్యాట్తో శక్తికొద్దీ ఎలా బాదాలన్న ధ్యాస తప్ప అతనికి మరోధ్యాస ఉండేది కాదు.

వాళ్ళ పీ.యూ.టీ. ప్రభాకర్ రాష్ట్ర స్థాయిలో జరిగే పదిహేనేళ్ళలోపు క్రికెట్ ఆటగాళ్ళ టోర్నమెంటుకు వాళ్ళ స్కూలు నుండి ఒక టీంను తీసుకెళ్ళాలని నిర్ణ యించాడు. ఆ టీంలో సుధాకర్ను ఓపెనింగ్ బ్యాట్స్మెన్గా తీసు కున్నాడు. అంతేకాదు, సుధాకర్ను టీంకు కాప్టెన్గా కూడా నియమించాడు. టోర్నమెంట్ తేదీ దగ్గర పడ్తుండటంతో సుధాకర్ తన టీంతో రోజంతా క్రికెట్ ఆడుతూ గడిపాడు. టోర్నమెంట్ ప్రారంభమైనప్పుడు సుధాకర్ ఆటతీరును చాలామంది క్రికెట్ పండితులు ప్రశంసించారు. సుధాకర్ టీం రన్నర్స్గా నిలిచి ట్రోఫీని కూడా గెల్చుకుంది.

ఈవిజయంతో సుధాకర్ తనో గొప్ప క్రికెట్ ప్లేయర్ను అవుతానని కలలు గనడం మొద లెట్టాడు. తనను తాను సచిన్టెండూల్కర్ గానో, మహేంద్రసింగ్ ధోనీలాగానో ఊహించు కునేవాడు. క్రికెట్లో తనకున్న టాలెంట్ను చూసి తనకు జాతీయ స్థాయిలో జరిగే పోటీల్లో కూడా సెలెక్ట్ చేస్తారని తనో గొప్ప ప్లేయర్గా గుర్తింపు పొందుతానని అనుకునేవాడు. ఈ విషయంలో ఉపేందర్, సుధాకర్ చాలాసార్లు చర్చించుకునే వాళ్ళు.

క్రికెట్ ఉన్నతవర్గాల ఆట అనీ, మన లాంటి కింది తరగతి వాళ్ళను ఎంత ప్రతిభ ఉన్నా పైకి రానీయరని ఉపేందర్ అంటుండే వాడు. కానీ సుధాకర్ ఉపేందర్ మాటల్ని సీరియస్గా తీసుకునేవాడు కాదు. తన ప్రతిభను ఎవరో ఒకరు, ఎప్పుడో అప్పుడు తప్పకుండా గుర్తిస్తారని సుధాకర్ నమ్ముతుండేవాడు.

సుధాకర్ఇంట్లో ఆర్థికపరిస్థితి క్రమంగా దిగజారిపోసాగింది. సారయ్య బతికున్నంత కాలం ఆ కుటుంబం గౌరవంగానే బతికింది. అతడు పోయాక అతని భార్య సంధ్యకు ఆ కుటుంబాన్ని ఎలా గట్టెక్కించాలో అర్థం కాలేదు. ఆమెకు భర్త ఇచ్చిపోయిన యేకైక స్థిరాస్తి ఇల్లు. ఆ ఇంటిని రెండు పోర్షన్లుగా మార్చి ఒక పోర్షన్ను అద్దెకిస్తే కొంత వెసలుబాటు ఉంటుందన్న ఐడియా ఆమెకొచ్చింది. సారయ్య దగ్గర పనిచేసిన కొందరు తాపీవర్కర్లు ఈ విషయంలో ఆమెకు సహాయం చేశారు. ఇంటిని రెండు పోర్షన్లుగా విడగొట్టటానికి చెయ్యాల్సిన పనంతా వాళ్ళు చేసి పెట్టారు. ఒక పోర్షన్ను అద్దెకివ్వటంతో ఆ ఇల్లు గడవటానికి కావలసిన కనీస ఆదాయం ఆ కుటుంబానికి లభించింది.

కొడుకు సుధాకర్తో ఆమె పదే పదే "చదువుకోరా నాయనా! ఎన్ని కష్టాలైనా పడి నీ చదువుకు కావలసిన పైసలు నేనిస్తరా!" అని చెబుతుండేది. సుధాకర్ చదువుకోవడం మానేసి ఎప్పుడూ క్రికెట్ ఆడుతుండటం ఆమెను చాలా కలవరపరచింది. "ఈ ఆట ఆడితే యేమొస్తుందిరా? చదువుకుంటే యేదన్న జాబ్ దొరుకుతది. చదువుకోరా నాయనా!"అని కొడుకును బతిమాలింది.

"క్రికెట్ అంటే యేందనుకున్నవే! చాలా గొప్ప గొప్పోళ్ళు ఆ ఆట ఆడ్తరు. లక్షలు కోట్లు సంపాదిస్తరు. నేను కూడా అట్లనే సంపాదిస్త" అంటుండేవాడు సుధాకర్.

క్రికెట్ ఆడి లక్షలు, కోట్లు ఎలా సంపాదిస్తారో సంధ్యకు అర్థమయ్యేది కాదు.

ఈలోగాపదోతరగతి పరీక్ష లొచ్చాయి. సుధాకర్ ఏమీ చదవకుండానే పరీక్షలు రాయడానికెళ్ళాడు. క్రికెట్ బాగా ఆడే కుర్రాడు... స్కూలుకో షీల్డు కూడా తెచ్చాడన్న సానుభూతితో అతని టీచర్లే అతనికి ఆన్సర్లు రాయ డానికి సహాయపడ్డారు. అలా సుధాకర్ పదో తరగతి

## గానకోకిల లతామంగేష్కర్

బాలీవుడ్ సంగీత ప్రపంచంలో గళానికి షష్టిపూర్తి చేసుకున్న 'నైటెంగేల్ ఆఫ్ ఇండియా' కుమారి లతామంగేష్కర్. అగ్రతారలు నర్గీస్ మొదలుకొని యువతరం మాధురీదీక్షిత్, ప్రీతిజింతాలకు కూడా ఆమె గళ సహకారం 'ప్లేబాక్'గా అందిస్తున్నారంటే లతమ్మ సుస్వరాల లాలిత్యం ఎటువంటిదో చెప్పకనే చెప్పినట్లవుతుంది.

మధ్యతరగతి కుటుంబంలో జన్మించి, సిగ్గు సిగ్గుగా మైక్రోఫోన్ వద్దకువెళ్ళిన లత చలనచిత్రపరిశ్రమలో ప్రవేశించిన నాటి నుంచి నేటి వరకు పద్నాలుగు భాషలలో 30,000 పాటలను అలవోకగా పాడి ఆమె చరిత్ర సృష్టించారు. 'భారత రత్న' వంటి ప్రతిష్టాత్మక అవార్డులు ఆమెను వెతుక్కుంటూ వచ్చి ఒళ్ళో వాలాయి.

ఘన విజయాలు సాధించినా పొగడ్తలకు పొంగి ఆగిపోకుండా తన కర్తవ్యాన్ని తాను నిర్వర్తించుకుంటూ తన రంగాన్ని సుసంపన్నం చేసుకుంటున్న శింజానమణిమంజీర నాదాల మన లతామంగేష్కర్.



బొటా బొటా మార్కులతో ప్యాసయ్యానని పించాడు.

తర్వాత ఇంటర్మీడియెట్‌లో చేరాడు. ఇంటర్ చదువుతున్నప్పుడు కూడా అతన్ని క్రికెట్ ఆడటానికి ఎవరో ఒకరొచ్చి తీసికెళ్ళేవాళ్ళు. ఆ నగరంలో ఉన్న క్రికెట్ క్లబ్బుల వాళ్ళల్లో ఓ క్లబ్‌వారు అతన్ని తన క్లబ్‌లో సభ్యునిగా చేర్చుకొని వాళ్ళ క్లబ్ తరపున అతన్ని క్రికెట్ ఆడించేవాళ్ళు. అంతో ఇంతో ముట్ట చెప్పేవాళ్ళు. టోర్నమెంట్ జరుగుతున్న రోజుల్లో అతని భోజనం ఖర్చు కూడా వాళ్ళే భరించేవాళ్ళు.

ఇంటర్ చదువుతున్న రోజుల్లో కూడా సుధాకర్ యే ఒక్కరోజు కూడా క్లాసుకెళ్ళేవాడు కాదు. ఎప్పుడు చూసినా క్రికెట్ మైదానాల్లోనే కనిపించేవాడు. ఇంటర్మీడియట్ పరీక్షలొచ్చాయి. ఈసారి అతనికెవరూ సహాయం చెయ్యలేదు. ఎవరైనా సహాయంచెయ్యకపోతారా అని ఎదురు చూశాడు. అతడు ఇంటర్ చదువుతున్న జూని యర్ కాలేజీలో పరీక్షలు చాలాస్ట్రిక్టుగా జరి గాయి. సుధాకర్ ఇంటర్ ఫెయిలయ్యాడు. దాంతో విద్యార్థిగా అతని జీవితం అంతమై పోయింది.

క్రికెట్ ఆడటానికి అతన్ని పిలిచేవాళ్ళు కూడా క్రమంగా తగ్గిపోయారు.

"ఇంటర్ ప్యాసై డిగ్రీ కాలేజీలో చేరి ఉంటే నీ జీవితం మరోలా ఉండేది. డిగ్రీ కాలేజీల్లో క్రికెట్‌కు మంచి ప్రోత్సాహం ఉంటుంది. నీకిప్పుడు యే కాలేజీలోనూ అడ్మిషన్ లేదు కాబట్టి నిన్నెవరూ క్రికెట్ ఆడటానికి పిలువరు... ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని కులవృత్తి చేసుకో.... నువ్వొస్తానంటే నిన్ను నాతో తీసుకపోతా" అన్నాడు ఉపేందర్.

"నేను రాను... ఇంకేదన్న చూసు కుంటా" అన్నాడు సుధాకర్.

సుధాకర్‌కు తననెవరో దారుణంగా మోసగించారని పించింది. తన ప్రతిభను గుర్తించని తన చుట్టూ ఉన్న సమాజం మీద అతనికి విపరీత మైన ద్వేషం ఏర్ప డింది. ఏదైనా అవ కాశం వస్తే ఈ సమాజం మీద ప్రతీకారం తీర్చు కోవాలనివించింది.

సుధాకర్ క్రికెట్ ఆడటం తగ్గిపోయి టీవీల్లో ప్రసార మయ్యే క్రికెట్ ఆటను చూడటం ఎక్కువైపోయింది. అంతర్జాతీయ క్రికెట్ మ్యాచెస్ జరుగుతున్న టైంలో ఎక్కడ ఫ్రీగా టీవీల్లో చూడటానికి అవకాశం ఉంటే అక్కడికి వెళ్తుండేవాడు.

ఇండియన్స్ ఆడుతున్నంత సేపు తనే ఆడుతున్నట్టుగా ఫీలయ్యేవాడు. ఒక బౌలర్ వేస్తున్నబంతిని తనైతే ఎలాఆడేవాడో ఊహించు కునేవాడు. ఇండియన్స్ మ్యాచ్ ఓడిపోతే చాలా బాధపడిపోయేవాడు. ఆ రోజంతా చాలా నిరుత్సాహంగా గడిపేవాడు. గెలిస్తే బోల్డు సంబరపడిపోయేవాడు. ఓడిపోతే ఎందుకు ఓడిపోయారో తన పక్కనున్నవాళ్ళకు విశ్లేషించి చెప్పేవాడు. గెలిస్తే ఎందువల్ల గెల్చారో వివ రించి చెప్పేవాడు. అతనిమాటలు వింటున్న వాళ్ళకు ఇతనికి క్రికెట్‌ను గురించిన అవగాహన చాలా గొప్పగా ఉందనిపించేది. ఏదైనా పెద్ద పత్రికలో ఇతడు క్రికెట్‌ను గురించి ఇలా విశ్లేషిస్తూ కామెంటరీ రాస్తే ఇతనికి చాలా పేరొచ్చేది... పాపం ఇతనికా అవకాశం ఎవరిస్తారు?... అనుకునేవాళ్ళు.

కొడుకు చదవు మానేసి యే పని పాటా లేకుండా ఊర్లో తిరుగుతుండటం చూసి సంధ్య "చదువు చట్టుబండలైపాయె. కులవృత్తయినా చేసుకొని బతకరాదురాసుధాకర్!" అంటుండేది.

ఆమె మాటల్ని సుధాకర్ పెద్దగా పట్టించుకునేవాడు కాదు. ఎవరో వస్తారు. తన ప్రతిభను గుర్తిస్తారు. తనను ఉన్నత శిఖరాలను అధిరోహింపజేస్తారు... ఆరోజు త్వరలోనే వస్తుంది. ఆ శుభఘడియకోసమే తను ఎదురు చూస్తున్నాడు... అనుకునేవాడతడు.

ఆవాడలో తనలాగే ఇంటర్ ఫెయి లయిన మరో ఇద్దరు యువకులతో అతనికి స్నేహం ఏర్పడింది. ముగ్గురు కలసి ఊరంతా తిరిగేవాళ్ళు. పెద్ద పెద్ద షాపుల ముందు నిల్చుని ఆ షాపుల్లో గ్లాసుకర్టెన్ల వెనక అమర్చ బడిన విలాసవస్తువులను అదేపనిగా చూస్తుండే వాళ్ళు. వేలకు వేల డబ్బు చెల్లించి ఆ వస్తువు లను కొనుక్కొని వెళ్తున్న ధనవంతుల వైపు ఈర్ష్యగా చూస్తుండేవాళ్ళు.

"ఈ వస్తువుల్ని వాళ్ళే ఎందుకు కొనుక్కోవాలి మనం ఎందుకు కొనుక్కోకూడదు. మన సమాజంలో ఈ ఆర్థిక అసమానలెందు కుండాలి? వాళ్ళ తాతలు తండ్రులు బాగా సంపాదించారు కాబట్టి వీళ్లిలా ఉన్నారు. మనం పేదకుటుంబాల్లో పుట్టాం కాబట్టి ఇట్ల ఉన్నాం... మనలో ఎంత ప్రతిభ ఉన్నా మనల్నెవడూ గుర్తించడు.... ఇది అన్యాయం... ఇది అక్రమం.. దీన్ని అంతం చెయ్యాలె" తన మిత్రులతో సుధాకర్ ఇలా వాదిస్తుండేవాడు.

## నృత్యదర్శకురాలు, దర్శకురాలు ఫారాఖాన్

బాలీవుడ్ నృత్య ప్రపంచాన్ని సమూలంగా మార్చి వేసిన ఖ్యాతి ఫారాఖాన్‌దే అంటే కాదది అతిశయోక్తి. ప్రఖ్యాత హిందీనటుడు షారుఖ్‌ఖాన్‌ను రైలుపెట్టెపైకెక్కించి డాన్స్ చేయించిన "జో జీతా వాహీ సికిందర్" అన్న తొలిచిత్రం ఆమెను కీర్తి శిఖరాలకెక్కించింది. దాంతో బాలీవుడ్ కొరియోగ్రఫీలో వినూత్నత్వం వెల్లివిరిసింది. ఇక అప్పట్నుంచి ఆమె చెప్పినట్టే ఘరానా తారాగణాన్ని అంతటిని తన తిల్లానాలకు డాన్స్ చేయించగలిగింది. మన ఫారాఖాన్.

నృత్యంలో కొత్త ఒరవడి సృష్టించిన ఫారా చిత్ర దర్శకత్వంలో కూడా కొత్తముద్రలు వేసింది. ఎక్కడ కొత్తదనం కనిపించినా వెంటనే ఆమె వివేకంతో విశ్లేషించి నచ్చితే 'యస్' అంటుంది. ఆమె అభిప్రాయాలు చాలా నిశితంగా ఉంటాయి. 'టాలెంట్'కు ఆమెను 'పవర్‌హౌస్' అంటే ఆశ్చర్యం



లేదు. ఆమె నృత్యం సమకూర్చిన 'ఎక్ పల్ కా జీనా' 'వో లడ్‌కీ కహా' ప్రేక్షక శ్రోతలను ఉర్రూతలూగించాయి. 'మన్సూన్ వెడ్డింగ్', 'బాంబే డ్రీమ్స్' 'మేరీ గోల్' 'యాన్ ఎడ్వెంచర్ ఇన్ ఇండియా' ప్రపంచరికార్డు సృష్టించాయి. ఇటీవలనే నర్తకి షకీరా తన స్టేజ్ నృత్యాలకు మన ఫారాఖాన్‌నే డైరెక్ట్ చేయమన్నారు. ఏంటాలెంటండీ!

దీన్ని అంతం చెయ్యడం ఎలాగో మాత్రం అతనికర్థమయ్యేది కాదు. అలాంటి అవకాశమేదన్నా దానంతటు అదే వస్తుందేమోనని అతడు ఎదురు చూడసాగాడు.

అలాంటి అవకాశం రానే వచ్చింది.

ఆ నగరంలో చాల పేరున్న ఓ రాజకీయనాయకున్ని అతని ప్రత్యర్థులు కత్తులతో పొడిచి చంపారు. హత్యకు గురయిన ఆ రాజకీయ నాయకుడు చాలామంది పేదవాళ్ళకు రకరకాలుగా సహాయం చేశాడు. ఎంతోమంది ఆడపిల్లల పెళ్ళిళ్ళు చేయించాడు. జబ్బుపడ్డ ఎంతో మందికి వైద్యసహాయం చేశాడు. ఎంతోమంది పేద విద్యార్థులు చదువుకోవ డానికి ఆర్థిక సహాయం చేశాడు. 'పేదల పాలిటి దైవం' అని పేరున్న ఆ నాయకుడు హత్యకు గురి కావడంతో పేదప్రజలు తీవ్రమైన ఆగ్రహానికి లోనయ్యారు. పెద్దపెట్టున ప్రజలు వీధుల్లో కొచ్చారు. ఎవరిచేతిలో చూసినా పెట్రోలు క్యాన్స్ ఉన్నాయి. గడ్డపారలున్నాయి. ఇంకా రకరకాల ఆయుధా లున్నాయి. ప్రభుత్వ ఆస్తులు కావొచ్చు... ప్రైవేటు ఆస్తులు కావొచ్చు. ఆస్తులనేవి కనిపిస్తే చాలు... పెట్రోలు పోసి తగులబెట్టారు. బస్సులు, కార్లు, మోటారు సైకిళ్ళు, స్కూటర్లు క్షణాల్లో అగ్నికి ఆహుతై పోయాయి.

కొన్ని గుంపులు విలాస వస్తువుల్ని షోకేసుల్లో పెట్టి అమ్మే షాప్స్ మీద పడ్డారు. షట్టర్స్‌ని పగులగొట్టారు. గ్లాసు కర్టెన్లను పగులగొట్టారు. వాటి వెనుక అమర్చబడిన టీ.వీ.సెట్లను, డీవీడీ ప్లేయర్లను, కంప్యూ టర్లను... చేతికేది దొరికితే దాన్ని పట్టుకొని పరిగెత్తడం మొదలెట్టారు.

నగరంలో జరుగుతున్న ఈ బీభత్స కాండను గూర్చిన వార్తల్ని సుధాకర్ విన్నాడు. నిద్రలో ఉన్న అతన్ని అతని మిత్రులొచ్చి లేపారు. యేం జరుగుతున్నదో చెప్పారు. సుధాకర్ వెంటనే కదిలాడు. అతడెప్పుడూ వెళ్ళే టీ.వీ.లమ్మే షోరూం వైపు పరిగెత్తాడు. అతని స్నేహితులు కూడా అతన్ని అనుస రించారు.

అప్పటికే ఆ షోరూం ముందు చాలా మంది గుమికూడి ఉన్నారు. ఆ షోరూం షట్టర్స్‌ని ఎలా పగులగొట్టాలో వాళ్ళకి తెలియ డం లేదు. సుధాకర్ అతని మిత్రులతో కలిసి దగ్గర్లోనే ఉన్న పెద్ద పెద్ద బండ రాళ్ళను తెచ్చి షట్టర్స్‌ని పగుల గొట్టారు. అక్కడున్న మిగతా జనం కూడా వాళ్ళతో చేతులు కలిపారు. ఆ షట్టర్స్‌ని పగుల గొడ్తోంటే సుధాకర్ ఇంతకాలం గూడు కట్టుకుపోయిన కసి, ద్వేషం తీరుతున్నట్టని పించింది. ఇలా తప్ప ఈ సమాజాన్ని మరోలా బాగు చెయ్యలేమని పించింది.

కాస్సేవట్లోనే షట్టర్స్ తెరుచుకున్నాయి. జనమంతా ఆ షోరూంలో కెళ్ళారు. గాజుతెరల్ని ముక్కలుముక్కలుగా పగులగొట్టారు. సుధాకర్ తనకెంతో ఇష్టమైన ఓ టీ.వీ. సెట్‌ను చేతిలోకి తీసుకున్నాడు. మిగతా వాళ్ళుకూడా ఆ షాపులో ఉన్న యేదో ఒక వస్తువును తమ చేతుల్లోకి తీసుకొని బయటకు పరిగెత్తసాగారు. కొన్ని క్షణాల్లోనే ఆ షాపులో ఉన్న వస్తువులు మొత్తం బయటకు వెళ్ళి పోయాయి..... చెల్లా చెదురై పోయిన గాజుముక్కలు తప్ప ఆ షాపులో ఏమీ మిగల్లేదు.

సుధాకర్ అతని మిత్రులు టీవీ సెట్లతో బయటకు పరిగెత్తారు... వాళ్లకు వాళ్ళు చేస్తున్న పని తప్పనిపించలేదు.

✿ ✿ ✿

నాలుగు రోజుల తర్వాత నగరంలో అల్లర్లు సద్దుమణిగాయి.... పోలీసులు చాలామంది ఇళ్లను రెయిడ్ చేస్తున్నారనీ, దొంగిలించబడిన వస్తువుల్ని స్వాధీనం చేసుకుంటున్నారని సుధాకర్‌కు తెలిసింది.

అతడు తెచ్చిన టీ.వీ. సెట్‌ను తీసుకెళ్ళి అతనింటికి దగ్గర్లోఉన్న ఓ చెరువులో పడేసి కళ్ళనీళ్ళు తుడుచుకున్నాడు.

'అణువు' శీర్షికకు
మినీ కవితలు
పంపండి

అశోక్ కుమార్,
305, ప్రగతి టవర్స్, మారుతీనగర్,
విజయవాడ-520 004.
సెల్ : 98485 04649

# నిరీక్షణ నిస్సహాయత కాదు

అనుకున్నది సాధించాలంటే
అంతో ఇంతో నిరీక్షణ తప్పదు.
అంతటా పరివ్యాప్తమైన గాలి
ఒక్కొక్కసారి
ఉందాలేదా అనే సందేహం కలిగిస్తుంది.
అంతలోనే అది నున్నని వేళ్లతో
శరీరాలను స్పృశించి
తన ఉనికిని చాటుకుంటుంది.
తూర్పుదిక్కు
రాత్రంతా పడిగాపులు కాస్తేనే
ఎదురు చూస్తున్న సూర్యబింబం
పొద్దున తన ముంగిట్లో సాక్షాత్కరిస్తుంది.
నిరీక్షణ నిస్సహాయత కాదు.
అది సంకల్పించిన లక్ష్యసిద్ధికోసం
మనసును అచంచలంగా నిలిపే ఏకాగ్రత.
నిరీక్షణ దశ
సహనాన్ని రాపిడి పెట్టి చూస్తుంది.
శ్వాసలను
వివిధ గతుల్లో నడుపుతుంది.
ఎంతటి నిశిత దృష్టినైనా భ్రమింపజేస్తుంది.
పడని అడుగులు పడ్డట్టు
ఏవేవో నీడలు నడిచొచ్చినట్టు.
నిరీక్షణ తీవ్రతను ఉపశమింపజేయడానికి
కలలు కాస్త ఉపకరిస్తాయి.
అయితే అవి ఉపకరణాలు మాత్రమే.
నిరీక్షించే క్షణాలు
దట్టమైన ఆ కలలను కప్పుకుని
స్తబ్ధంగా పడుకుంటే
అంతిమగమ్యం అగమ్యమవుతుంది.
క్షణకాలికమైనా
దినకాలికమైనా
సహనాన్ని కోల్పోని నిరీక్షణ
ఫల స్వరూపిణిగా ఎదుట నిలుస్తుంది.

- డా॥ సి.నారాయణరెడ్డి